
సాక్షి పల్నాడు

గురువారం । 3 । ఆగస్టు । 2023



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: ఎగువ నుంచి నీరు వచ్చి చేరుతుండటంతో పులిచింతల ప్రాజెక్టు నిల్వ బుధవారం సాయంత్రానికి 34 టీఎంసీలకు చేరింది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 3,422 క్యూసెక్కులు విడుదల చేశారు.



హుండీ ఆదాయం రూ.15లక్షలు

దుర్గి: అడిగొప్పల శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి హుండీ కానుకలు లెక్కించగా రూ. 15,43,027ల ఆదాయం వచ్చినట్లు ఈఓ. శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు.

న్యూస్‌రీల్

జేసీతో సమావేశమైన ట్రైనీ జూనియర్ న్యాయమూర్తులు



గుంటూరు : శిక్షణలో ఉన్న 11 మంది జూనియర్ సివిల్ న్యాయమూర్తులు బుధవారం జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారిని కలిశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో సమావేశమైన ట్రైనీ న్యాయమూర్తులు రెవెన్యూ, పౌరసరఫరాలు, స్పందన, జగనన్నకు చెబుదాం, రికార్డు రూమ్ నిర్వహణ, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల విధి నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. జేసీ పలు అంశాలపై వారితో చర్చించారు. మారుతున్న కాలంలో ప్రజల అవసరాల నిమిత్తం రెవెన్యూ శాఖలో వస్తున్న వేగవంతమైన మార్పులను వివరించారు. న్యాయమూర్తులు పలు సందేహాలను నివృత్తి చేశారు.

సజావుగా పింఛన్ల పంపిణీ




నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుకను గుంటూరు జిల్లాలో బుధవారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్ళి వలంటీర్లు అందజేశారు. రెండో రోజు జిల్లాలో 92.70 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,49,667 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.68.59 కోట్లు కేటాయించింది. బుధవారం సాయంత్రానికి 2,31,430 మందికి నగదు అందజేశారు.

ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా ముస్లిం, మైనార్టీ అభ్యర్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కల్పిస్తున్నట్లు గుంటూరు-1, 2 ఉర్దూ అకాడమీ కంప్యూటర్ శిక్షణ కేంద్రాల ఇన్‌చార్జ్‌లు షేక్ మహిమున్నీసా, షేక్ కరీముద్దీన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల మూడో వారంలో ప్రారంభం కానున్న డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ కోసం ఈనెల 17వ తేదీలోపు ఆసక్తి గల అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. టెన్త్‌లో ఉత్తీర్ణులై, ఉర్దూ భాషలో చదవడం, రాయడం వచ్చిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. మూడు నెలల పాటు శిక్షణ పొందిన అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. గుంటూరు-1 పరిధిలో పాలాసుపత్రి వద్ద ఉన్న చిన్నబజారులోని అమీనా కాంప్లెక్స్‌లోని ఉర్దూ అకాడమీ శిక్షణ కేంద్రంలో నేరుగానూ, 85550 88516 సెల్ నంబర్లో సంప్రదించాలని తెలిపారు. అదే విధంగా గుంటూరు-2లో కృష్ణనగర్ రెండో లైనులోని శిక్షణ కేంద్రంలో 94940 42963 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

యార్డులో 36,473 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 33,985 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 36,473 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10 వేల నుంచి రూ.24 వేల వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10 వేల నుంచి రూ.26 వేల వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,500 నుంచి రూ.24 వేల వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10 వేల నుంచి 25,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5 వేల నుంచి రూ.14 వేల వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,724 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఆరోగ్య సమాజమే ప్రభుత్వ ధ్యేయం

- నేరుగా లబ్ధిదారుల చెంతకే పౌష్టికాహారం చరిత్రాత్మకం
- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లిలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ప్రారంభం
- గర్భిణులు, బాలింతలకు కిట్లు పంపిణీ



సత్తెనపల్లిలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్టును అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి(ముప్పాళ్ల): ఆరోగ్య సమాజం నిర్మాణం చేయాలనే సంకల్పంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తున్నట్లు జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. పట్టణంలోని నియోజకవర్గ కార్యాలయంలో పథకాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీ అధ్యక్షత వహించారు. మంత్రి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పరిపూర్ణ ఆరోగ్యానికి పోషణ పథకం దోహదపడుతుందని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారుల ఇంటికే నేరుగా పోషకాహారాన్ని పంపిణీ చేయటం చరిత్రాత్మకమన్నారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఎదగడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సీడీపీఓ టి.శ్రీలత మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో కిట్‌కు నెలకు ఒక్కొక్కరిపై రూ.850 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను మంత్రి సందర్శించి ఆహార పదార్థాలు పోషకాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ షేక్ నాగూర్‌మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, పట్టణ కన్వీనర్ సహారా మౌలాలి, రూరల్ మండల కన్వీనర్ రాయపాటిపురోషోత్తం, ఎంపీడీఓ సత్యనారాయణ, కౌన్సిలర్ బండి రాజ్యలక్ష్మి, పల్నాడు జిల్లా మహిళా నాయకురాలు డాక్టర్ గీతాహాసంతి, పక్కాల సూరిబాబు, రాష్ట్ర రైతు సలహామండలి సభ్యులు కళ్లం విజయభాస్కరరెడ్డి, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు అచ్యుతశివప్రసాద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలకా జయపాల్, ఏసీడీపీఓ సంతోషకుమారి పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణలో బీఎల్‌ఏలు పాల్గొనవచ్చు

రాజకీయ పార్టీల ప్రతినిధులతో జేసీ శ్యామ్‌ప్రసాద్



నరసరావుపేట: జిల్లాలో గతనెల 21 నుంచి ఈనెల 21వరకు బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌ఓ) ఓటర్ల జాబితా సవరణపై చేస్తున్న సర్వేలో రాజకీయ పార్టీలు తమ పోలింగ్ బూత్ లెవల్ ఏజెంట్ (బీఎల్‌ఏ)లను ఏర్పాటు చేసుకొని పరిశీలనలో పాల్గొనవచ్చునని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణపై బుధవారం కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా పరిశీలనలో వచ్చిన సమస్యలను గుర్తించి, పరిష్కారమార్గం చూపడం జరుగుతుందని పేర్కొన్నారు. పోలింగ్ బూత్ లెవల్ ఏజెంట్‌లు సర్వే ప్రక్రియలో ప్రత్యక్షంగా పాల్గొనవచ్చునన్నారు.

సంపులో పడి బాలుడి మృతి

రొంపిచర్ల : నీరు నిల్వ చేసే సంపులో పడి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని అన్నవరం గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ సుభాని(4) ప్రతి రోజూ అంగన్వాడీ కేంద్రానికి వెళ్తారు. కానీ బుధవారం రోజు అంగన్వాడీ కేంద్రానికి కాకుండా గ్రామంలో ఎస్సీ కాలనీలో గల పాఠశాలకు వెళ్లడానికి ప్రయత్నం చేశాడు. అయితే స్కూల్ సమీపంలో గల నీరు నిల్వ చేసే సంపు వద్దకు రాగానే అక్కడకు వెళ్లి లోపలికి వెళ్లి చూస్తుండగా కాలు జారి లోపలకు పడిపోయి నీట మునిగి ఊపిరిరాడక సుభానీ మృతి చెందారు. రెండు గంటల అనంతరం తన కుమారుడు స్కూల్ నుంచి ఇంటికి రాలేదని బాలుడి తల్లిదండ్రులు వెతుకుతుండగా, గ్రామస్తుల సమాచారం మేరకు సంపు వద్దకు వెళ్లి చూడగా మృతి చెంది కనిపించాడు. అనంతరం గ్రామస్తులు సంపులో నుంచి మృతదేహాన్ని బయటకు తీసి ఇంటి వద్దకు చేర్చారు.

రిటర్నింగ్ అధికారుల నియామకం

నగరంపాలెం: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులను నియమిస్తూ బుధవారం గెజిటెడ్ నోటిఫికేషన్ విడుదల చేశారు.

పెదకూరపాడు : డెప్యూటీ కలెక్టర్ జిల్లా విజిలెన్స్ సెల్-2

తాడికొండ (ఎస్సీ): స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కోనేరు రంగారావు కమిటీ

మంగళగిరి : స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ జిల్లా ప్రొగ్రామ్ మేనేజర్

పొన్నూరు: ప్రాజెక్టు డైరెక్టర్ డీఆర్‌డీఏ గుంటూరు

వేమూరు (ఎస్సీ): చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జిల్లాపరిషత్ గుంటూరు.

రేపల్లె: ఆర్డీఓ రేపల్లె **తెనాలి** : సబ్ కలెక్టర్ తెనాలి **బాపట్ల** : ఆర్డీఓ, బాపట్ల

ప్రత్తిపాడు (ఎస్సీ): ఆర్డీఓ గుంటూరు, **గుంటూరు పశ్చిమ** : అదనపు కమిషనర్ జీఎంసీ

గుంటూరు తూర్పు: కమిషనర్ జీఎంసీ **చిలకలూరిపేట**: స్పెషల్ కలెక్టర్ పులిచింతల

నరసరావుపేట: ఆర్డీఓ నరసరావుపేట **సత్తెనపల్లి** : ఆర్డీఓ సత్తెనపల్లి

వినుకొండ : స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ (పులిచింతల)

మాచర్ల : స్పెషల్ కలెక్టర్ (పులిచింతల) **గురజాల** : ఆర్డీఓ, గురజాల

అన్ని జిల్లాల్లో ఎన్‌సీసీ విస్తరణకు సన్నాహాలు

- ఎన్‌సీసీ అకాడమీ ఏర్పాటుకు స్థలం కేటాయించేందుకు ప్రభుత్వ హామీ
- ఆంధ్ర, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమొడోర్ మధుసూదనరెడ్డి



ఎన్‌సీసీ అధికారులతో మధుసూదనరెడ్డి

తెనాలి: ఎన్‌సీసీని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో విస్తరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమొడోర్ వి.మధుసూదనరెడ్డి చెప్పారు. స్థానిక ఐతానగర్‌లోని ఎన్‌సీసీ 22వ ఆంధ్రా బెటాలియన్‌ను బుధవారం ఆయన సందర్శించారు. నెలరోజుల క్రితం బాధ్యతలు చేపట్టిన ఎయిర్ కమొడోర్ మధుసూదనరెడ్డి ఎన్‌సీసీ కేంద్రాల సందర్శనలో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఎన్‌సీసీ అధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. 2022-23 సంవత్సరంలో ఎన్‌సీసీ బెటాలియన్ కార్యక్రమాలపై ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్‌సీసీ కార్యకలాపాలు ఏవిధంగా జరుగుతున్నాయి...వాటిని మరింత మెరుగ్గా ఎలా చేయాలనే అంశంపై పరిశీలన చేస్తున్నట్టు ఈ సందర్భంగా చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాను ఇంతకుముందే కలిసినట్టు తెలిపారు. ఎన్‌సీసీ శిక్షణ అకాడమీ ఏర్పాటుకు అవసరమైన స్థలం సమకూర్చేందుకు ముఖ్యమంత్రి హామీనిచ్చినట్టు చెప్పారు. అకాడమీ ఏర్పాటుతో ఎన్‌సీసీ క్యాడెట్లకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో మరో 60 వేలమంది విద్యార్థులు ఎన్‌సీసీలో ఎన్‌రోల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఎన్‌సీసీ అధికారులు ఎ.ఉమాశంకర్, వి.మౌనిక, జి.హనుమంతరావు, సమ్యానాయక్, సర్దార్ పరిశా, కత్తి శ్రీనివాసరావు, కె.స్వామి, బాషా, గోపి, భిక్షాలు పాల్గొన్నారు.

శరవేగంగా గుంటూరు - నంద్యాల డబ్లింగ్ పనులు



శావల్యాపురం రైల్వేస్టేషన్‌ను సందర్శించిన రైల్వే అధికారులు

శావల్యాపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలో గుంటూరు-నంద్యాల వరకు నిర్వహిస్తున్న రైల్వే డబ్లింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు సికింద్రాబాద్ రైల్వే సంరక్షణ భద్రతా అధికారి (సీఆర్ఎస్) ప్రణ్‌జీవ్ సక్సేనా అన్నారు. బుధవారం శావల్యాపురం రైల్వేస్టేషను సందర్శించారు. అనంతరం చీకటీఈగలపాలెం రైల్వే స్టేషనులో 16 కిలోమీటర్ల రైల్వే డబ్లింగ్ పనులకు ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా రైల్వే భద్రతా అధికారి సక్సేనా మాట్లాడుతూ గుంటూరు నుంచి నంద్యాల వరకు 257 కిలోమీటర్ల ఉండగా ఇప్పటివరకు 160 కి.మీ. వరకు డబ్లింగ్ రైల్వే ట్రాక్ పనులు పూర్తి అయ్యాయన్నారు. ఈఏడాది రైల్వే డబ్లింగ్ పనుల్లో భాగంగా ఫిబ్రవరి 28న శావల్యాపురం రైల్వే స్టేషను నుంచి మునమాక రైల్వేస్టేషను వరకు 20 కిలోమీటర్ల వరకు పనులు ప్రారంభించామన్నారు. గతనెల 5వ తేదీన తర్లుపాడు, కంభం, జంగభట్ల కృష్ణాపురం, 22 కిలోమీటర్ల వరకు డబ్లింగ్ పనులు ప్రారంభించామన్నారు. నరసరావుపేట రూరల్ పరిధిలో మునపాక నుంచి సాతులూరు వరకు 22 కిలోమీటర్ల వరకు సెప్టెంబరు నెలలో పూర్తి చేస్తామన్నారు. గిద్దలూరు, దిగువమెట్ట, 38 కిలోమీటర్ల పనులు జనవరి నాటికి పూర్తి చేస్తామన్నారు. నడికూడి - శ్రీకాళహస్తి రైల్వే పనులు శావల్యాపురం రైల్వేస్టేషను వరకు పూర్తి అయ్యాయని మార్చి 2024 నాటికి దర్శి వరకు రైల్వేపనులు పూర్తి అవుతాయన్నారు. గుంటూరు నుంచి తిరుపతి వెళ్లే రైలు శావల్యాపురం రైల్వే స్టేషనులో నిలుపుదల చేయాలని ప్రజలు కోరగా త్వరలో సమస్య పరిష్కారిస్తామన్నారు. శావల్యాపురం 268 సమీపాన గేటు వద్ద ఆర్‌యూబీ ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ అనుమతులు మంజూరు అయ్యాయని త్వరలో టెండరు ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తామని, గుంటూరు డీఆర్ఎం మంగళగిరి రామకృష్ణ తెలిపారు. అనంతరం రైల్వే ట్రాలీ ద్వారా చీకటీఈగలపాలెం నుంచి శావల్యాపురం రైల్వేస్టేషన్ వరకు ట్రయల్ రన్ నిర్వహించారు. వారితో సీపీఓ నీరజ్ ఆగర్వాల్, కుందు రామారావు, రామరాజు, సీఐ తిరుపతిరావు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

'మిస్టర్' పర్‌ఫెక్ట్




మిస్టర్ ఏపీ షేక్ నయీమ్‌కు క్రౌనింగ్ చేస్తున్న నిర్వాహకులు

నేటి యువత కొత్త ఆలోచనల వైపు, సృజనాత్మక ధోరణి వైపు నడిపిస్తున్నారు. ఆ కోవకు చెందినవాడే పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన యువకుడు షేక్ నయీమ్. ఫ్యాషన్ డిజైనర్‌గా రాణిస్తునే మరోవైపు ఆ రంగానికి అనుబంధంగా ఉండే అందాల పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచాడు. జూలై 30వ తేదీ విశాఖపట్నం గ్రీన్ పార్క్ హోటల్‌లో స్టార్ ఆంధ్రప్రదేశ్ సంస్థ నిర్వహించిన పోటీలలో మిస్టర్ ఆంధ్రప్రదేశ్‌గా షేక్ నయీమ్ విజేతగా నిలిచాడు. చిలకలూరిపేట పట్టణం సుభానినగర్‌లో ఉండే వైఎస్సార్ సీపీ నాయకుడు స్పెడ్స్ కరిముల్లా, జాకిరా దంపతుల కుమారుడైన నయీమ్‌కు విద్యార్థి దశ నుంచి సృజనాత్మకత ఎక్కువ. ఇంటర్ విద్య అనంతరం చెన్నైలోని హిందుస్థాన్ యూనివర్సిటీలో ఫ్యాషన్ డిజైనింగ్‌లో 2019లో బ్యాచిలర్స్ డిగ్రీని గోల్డ్ మెడల్‌తో పూర్తి చేశాడు. చదువుతున్న సమయంలోనే ప్రపంచశాంతి కోసం నిర్వహించిన ఒక కార్యక్రమానికి గానూ 2017లో గిన్నిస్ రికార్డ్స్ నుంచి ప్రశంసా పత్రం అందుకున్నాడు. 2018 జనవరి 21 ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించిన ప్రదర్శనకు గాను గిన్నిస్ రికార్డ్స్‌లో రెండోసారి స్థానం లభించింది. చెన్నైలో బ్యాచిలర్స్ డిగ్రీ అనంతరం 2022లో యూకేలోని బ్రిటిష్ స్కూల్ ఆఫ్ ఫ్యాషన్ నుంచి మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశాడు. మాస్టర్స్ చేస్తున్నప్పుడే 2022 ఆగస్టులో లండన్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో ఫ్యాషన్ ఇలస్ట్రేషన్ అనే అంశం ప్రజెంట్ చేసే అవకాశం దక్కించుకోవడం విశేషం.

– చిలకలూరిపేట

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 514.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. కుడి కాలువకు నీటిని నిలుపుదల చేశారు. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 853.80 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి 77,359, రోజా నుంచి 886 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

టీడీపీ హయాంలో అభివృద్ధి శూన్యం

లోకేష్ ప్రజలకు క్షమాపణ చెప్పి నియోజకవర్గంలో అడుగుపెట్టాలి

- జగనన్న పాలనలో నియోజకవర్గంలో రూ.3500 కోట్లతో అభివృద్ధి
- అభివృద్ధిపై దమ్ముంటే టీడీపీ నేతలు చర్చలకు రావాలి
- గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు

దాచేపల్లి: 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు, ఎమ్మెల్యేగా ఉన్న యరపతినేని శ్రీనివాసరావు నియోజకవర్గంలో చెప్పుకోవటానికి ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదని, పాదయాత్రతో గురజాల నియోజకవర్గానికి వస్తున్న లోకేష్ ముందుగా అభివృద్ధి చేయలేదని ఒప్పుకుని ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాదయాత్రకు పేటెంట్ హక్కు వైఎస్సార్ కుటుంబానికి మాత్రమే దక్కుతుందన్నారు. విజన్ లేని చంద్రబాబు రాజకీయాలు చేస్తే ఓట్లు రావని గ్రహించిన టీడీపీ కనీసం వార్డు మెంబరుగా కూడా గెలవలేని లోకేష్‌ను రోడ్లపై తిప్పుతుందని ఎద్దేవా చేశారు. నాడు అధికారంలో ఉండి కూడా అభివృద్ధిని విస్మరించారని, కల్లబొల్లి మాటలతో ప్రజలకు అభూత కల్పన కల్పించి అరచేతిలో స్వర్గం చూపించేందుకు లోకేష్ పాదయాత్రతో నియోజకవర్గంలోకి వస్తున్నారని, అభివృద్ధి నిరోధకులుగా ఉన్న వ్యక్తులు పాదయాత్రలు చేయటం సిగ్గుచేటన్నారు. టీడీపీ నాయకులకు దమ్ము, ధైర్యం ఉంటే నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని, గతంలో చర్చలకు రమ్మంటే స్థానిక టీడీపీ నాయకుడు యరపతినేని రాకుండా పారిపోయారని ఆయన అన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనాలో జరిగిన అభివృద్ధిపై, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిపై కనీసం లోకేష్ అయిన బహిరంగ చర్చకు రావాలని ఎమ్మెల్యే కాసు సవాల్ విసిరారు.

నియోజకవర్గంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి..

నియోజకవర్గంలో ఈ నాలుగేళ్లలో రూ.3500 కోట్లతో అభివృద్ధి జరిగిందన్నారు. ప్రతిది లెక్కలతో వచ్చి సమాధానం చెప్పటానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. తమ హయాంలో పిడుగురాళ్ల మెడికల్ కళాశాల, బైపాస్ పనులు పూర్తి చేస్తున్నామని, దాచేపల్లి, గురజాలను మున్సిపాలిటీలు చేశామని, గురజాల-దాచేపల్లి హైవే, రూ.210 కోట్లతో తాగునీటి పథకాలు, 22వేల మందికి ఇళ్ల పట్టాలు, నాడు-నేడు కింద స్కూళ్ల అభివృద్ధి, సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామని ఎమ్మెల్యే కాసు చెప్పారు.

దేవుడి సొమ్మును తిన్నవారు సైతం విమర్శించేవారే..!

నియోజకవర్గంలో అక్రమ మైనింగ్, పేకాట క్లబ్ పెట్టించి పుష్కర పనుల్లో దేవుడి సొమ్ము తిన్నవాళ్లు కూడా తమ హయాంలో జరిగిన అభివృద్ధిని విస్మరిస్తూ మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే కాసు అన్నారు. క్వారీ గుంతల్లో పడి చనిపోయిన వారికి మానవత దృక్పథంతో తాము అండగా ఉన్నామని, దీన్ని కూడా రాజకీయంగా వాడుకున్న ఘనత యరపతినేనికే దక్కుతుందన్నారు. కెమికల్ పరిశ్రమల వలన ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, దీనిపై సమగ్ర ఆలోచన చేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు.

కన్నబిడ్డకు తల్లిపాలు శ్రేష్ఠం

డీఎంహెచ్ఓ డాక్టర్ శోభారాణి

నరసరావుపేట: ప్రతి తల్లీ కన్నబిడ్డకు తప్పకుండా తల్లిపాలు ఇవ్వాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి సూచించారు. జిల్లాలో ప్రారంభమైన తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకొని బుధవారం పల్నాడురోడ్డులోని ఏరియా హాస్పిటల్‌లో గల కాన్పుల వార్డు గోడపత్రిక ఆవిష్కరించారు. అనంతరం వార్డులో ఉన్న బాలింతలు అందరికీ తల్లిపాల యొక్క విశిష్టతను పోస్టర్ సహాయంతో వివరించి చెప్పారు. ఈ కార్యక్రమం ఏడవతేదీ వరకు జిల్లా వ్యాప్తంగా అమలు అవుతుందన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, డీపీహెచ్ఎన్ఓ సురేఖ, గైనకాలజిస్ట్ డాక్టర్ సింధూజ, జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, సీహెచ్ఓ స్వర్ణలత పాల్గొన్నారు.



బాలింతలకు తల్లిపాల గురించి వివరిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ శోభారాణి

నలభై ఏళ్లు జెండా మోసిన వారికి నోటీసులా !

టీడీపీ నాయకుడు కోడెలశివరామ్ ఆగ్రహం

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): నలభై సంవత్సరాలు టీడీపీ జెండా మోసిన వారికి నోటీసులు పంపించటం ఏంటి... కులాలను అడ్డుపెట్టుకొని పార్టీలు మారుతూ... పార్టీ ఆఫీసుకు రాకుండా నాటకాలు ఆడేవారు టీడీపీ పెద్దలకు కనపడటం లేదా అని మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు తనయుడు, టీడీపీ నాయకుడు డాక్టర్ కోడెల శివరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్తెనపల్లిలోని టీడీపీ నాయకులకు పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు నోటీసులు ఇవ్వడంపై కోడెల శివరామ్ స్పందించి బుధవారం విలేకరులతో మాట్లాడారు. పార్టీ అధినేత చేతుల మీదుగా ప్రారంభించిన పార్టీ కార్యాలయంలోకి అడుగుపెట్టని కన్నా లక్ష్మీనారాయణకు ఎందుకు నోటీసులు ఇవ్వరు అని ప్రశ్నించారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా అవసరం అయితే ప్రాణాలు తీసుకుంటాం కానీ మరో పార్టీ మారం అని చెప్పారు. గత రెండు సంవత్సరాలుగా సత్తెనపల్లిలో కోడెల శివప్రసాదరావు పేరు వినపడకుండా చేయాలని కొందరు చూస్తున్నారన్నారు. ఎవరైతే పల్నాడు జిల్లాలో పార్టీ కోసం పోరాడుతున్నారో వారికి నోటీసులు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. కోడెల శివప్రసాదరావు చనిపోయిన తర్వాత మా కుటుంబం ఎలా ఉందో కూడా కనీసం జీవీ ఆంజనేయులు పరామర్శించలేదు. కోడెలకు నివాళులర్పించలేదు అని నేడు అడిగినందుకు మా అనుచరులకు నోటీసులు ఇచ్చారు. కులాన్ని, పార్టీని అడ్డుపెట్టుకొని నాటకాలు ఆడేవారు అధిష్టానానికి కనపడడం లేదా అని ప్రశ్నించారు. చిలకలూరిపేట, నరసరావుపేట, గురజాలలో పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్న వారికి ఇప్పటివరకూ ఎందుకు నోటీసులు ఇవ్వలేదో చెప్పాలని నిలదీశారు. నోటీసులు ఇచ్చే ముందు కనీసం వారి అభిప్రాయాలు తీసుకునే పని లేదా, ఒక పక్క పార్టీ కార్యక్రమాలు ఎవరైనా చేసుకోవచ్చు అని అధినేత చంద్రబాబు చెబుతున్నారు. మరో వైపు మా కార్యకర్తలకు నోటీసులు ఇస్తూ ఇబ్బందులు పెట్టడంలో అర్థం ఏంటి? పదవుల కోసం సత్తెనపల్లిలో ఇటీవల నాయకులు పార్టీలోకి వచ్చారు. బెదిరిస్తే మేము బెదిరే వ్యక్తులం కాదు. కోడెల ఆశయాలను బతికించడం కోసం మేము ఎక్కడికైనా వెళతాం. పార్టీలో పదవులు కోసం వచ్చే వారికి ఉన్న విలువ నలభై ఏళ్లుగా జెండా మోసే వారికి లేకపోవడం దౌర్భాగ్యం. ఏనాడూ పదవుల కోసం ఆరాట పడలేదు. మిగిలిన నియోజకవర్గాల్లో పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నా సరే వారికి ఎందుకు నోటీసులు ఇవ్వడం లేదు. రాబోయే నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఖచ్చితంగా పాల్గొంటాం. పాదయాత్రని విజయవంతం చేస్తామన్నారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కారంచేడు: ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొని మరో వాహనంపై వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. వాడరేవు– పిడుగురాళ్ల ప్రధాన రహదారిలో కారంచేడు– చీరాల మార్గంలో ఉన్న రెండు వంతెనల మధ్యలో ఈ ప్రమాదం బుధవారం రాత్రి చోటుచేసుకుంది.

గర్భిణులు, బాలింతలకు పోషకాహారం

జేసీ శ్యాంప్రసాద్



కలెక్టరేట్‌లో కిట్‌ను అందజేస్తున్న జేసీ శ్యాంప్రసాద్, పీడీ అరుణ, సీడీపీఓ ఉమామహేశ్వరి

నరసరావుపేట: వైఎస్సార్ సంపూర్ణ పోషక కిట్లను బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ కోరారు. జిల్లాలోని అంగన్‌డీ కేంద్రాల ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషక కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ హాలులో ప్రారంభించారు. బరంపేట, లింగంగుంట్లకు చెందిన గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.అరుణ మాట్లాడుతూ కిట్‌లో మొదటి విడతగా మూడు కేజీల ఫోర్టిఫైడ్ బియ్యం, ఒక కిలో కందిపప్పు, అర కిలో నూనె, రెండున్నర లీటర్ల పాలు, 13 కోడి గుడ్లు, రెండు కిలోల రాగి పిండి, కిలో అటుకులు, పావు కిలో చొప్పున చిక్కి, బెల్లం, ఖర్జూరం అందిస్తున్నట్లు వివరించారు. అలాగే రెండో విడత పాలు రెండున్నర లీటర్లు, 12 కోడిగుడ్లు అంగన్‌వాడీ కేంద్రాల నుంచి అందించనున్నట్లు పేర్కొన్నారు. మాచర్ల, దుర్గి, వెల్దుర్తి మండలంలోని 162 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో లబ్ధిదారులైన గర్భిణులు, బాలింతలు, తల్లులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కార్యక్రమం అందిస్తున్నట్లు వివరించారు. బలవంతమైన ఆహారాన్ని తిని ఆరోగ్యం మెరుగుపర్చుకొని ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిచ్చి మెరుగైన భవిష్యత్ సమాజానికి పునాది వేయాలని కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి ఎస్.పద్మశ్రీ, అదనపు డీఎండీహెచ్‌ఓ డాక్టర్ కె.పద్మావతి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి, ఐసీడీఎస్ స్థానిక సీడీపీవో ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

టీకాలతో ప్రాణాంతక వ్యాధులకు చెక్

మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో తల్లితండ్రులు తమ బిడ్డలకు వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించి వారిని ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ ప్రజలకు సూచించారు. జిల్లాలో వైద్యఆరోగ్యశాఖ పర్యవేక్షణలో ఈనెల ఏడో తేదీ నుంచి ప్రారంభమయ్యే మిషన్ ఇంద్ర ధనస్సును పురస్కరించుకొని బుధవారం జాయింట్ కలెక్టర్ తన చాంబర్‌లో ఆరోగ్యశాఖ అధికారులతో కలసి గోడపత్రికను ఆవిష్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి.శోభారాణి, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ జి.చంద్రశేఖర్, డీఐఓ డాక్టర్ బి.గీతాంజలి, జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, డాక్టర్ నాగ పద్మజ, డెప్యూటీ డెమో సాంబశివరావు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ దినం..

నరసరావుపేట: జాతీయ నులిపురుగుల నివారణ దినం విజయవంతానికి కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ కోరారు. ఈనెల పదో తేదీ నుంచి నిర్వహించనున్న కార్యక్రమాన్ని పురస్కరించుకొని బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్నటు వంటి 4,15,968 మంది పిల్లలకు మాత్రలు వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. దీనికి సంబంధించిన విజ్ఞాన, పరిజ్ఞాన గోడపత్రికలు, కరపత్రికలు ఆవిష్కరించారు. జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి మాట్లాడారు. జిల్లా వైద్యశాఖ అధికారి జి.చంద్రశేఖర్, జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్, ఐసీడీఎస్ పీడీ అరుణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ ఎంతో అద్భుతం

- ప్రజల ఆరోగ్యానికి సీఎం వైఎస్ జగన్ ప్రాధాన్యం
- గర్భిణులు, బాలింతలకు మేలు
- ప్రభుత్వ విప్ పీఆర్కే



లబ్ధిదారులకి కిట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: బాలింత, గర్భిణులు ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని చేపట్టినట్లు వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. పురపాలక సంఘ కార్యాలయంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆయన విద్యా, వైద్యంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. ఇటువంటి పథకాల ద్వారా వివిధ రకాల బలహీనత, రక్తహీనత ఉన్న మహిళలు, సంపూర్ణ పోషణతో శిశువులకు జన్మనివ్వటం జరుగుతుందని పేర్కొన్నారు. నేరుగా ఇంటి వద్దకే కిట్లు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ఐసీడీఎస్ అధికారి లీలావతి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తురక కిశోర్, మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ జలీల్, జెడ్పీటీసీ సభ్యుడు మల్లు స్వామి, కౌన్సిలర్ షేక్ సుభాని, కరిముల్లా, మస్తాన్, కమిషనర్ ఈవీ రమణబాబు, ఏతం సామేలు, మైనార్టీ నాయకులు షేక్ అల్లావుద్దీన్ పాల్గొన్నారు.

ఆర్మీ ర్యాలీ అభ్యర్థుల వసతి ఏర్పాట్లు పరిశీలన

నరసరావుపేట ఈస్ట్: ఆర్మీ ఎంపికల ర్యాలీ ఏర్పాట్లను జిల్లా జాయింట్ శ్యామ్‌ప్రసాద్ బుధవారం పరిశీలించారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేట డీఎస్‌ఏ స్టేడియంలో 20 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి ర్యాలీకి హాజరయ్యే అభ్యర్థులు ఉండేందుకు అనువైన ప్రాంతాలను ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి, కలెక్టరేట్ ఏఓ అనిల్‌కుమార్‌లతో కలసి పరిశీలించారు. దీనిలో భాగంగా శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల బాలుర వసతి గృహాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆర్మీ ర్యాలీకి వేల సంఖ్యలో హాజరయ్యే అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జె.రాంబాబు

పెదకాకాని: గంజాయి తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు మంగళగిరి డీఎస్పీ జె.రాంబాబు తెలిపారు. స్థానిక స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కేరళ రాష్ట్రానికి చెందిన శైజు మచ్చింగల్ వర్గీస్, మండకర సడకతుల్లాలు స్నేహితులు. చెడు అలవాట్లకు బానిసలుగా మారి, సులువుగా డబ్బులు సంపాదించాలని దురుద్దేశంతో ఒడిశా వెళ్లి అక్కడ నుంచి 94 కేజీల గంజాయిని తీసుకుని కారులో వెళ్తున్నారు. సోమవారం గుంటూరు ఆటోనగర్ సమీపంలోకి చేరుకునే సరికి మరమ్మతులకు గురైంది. కారును రిపేరు చేయించేందుకు ఆటోనగర్ ఫేస్– 4 లోని బొల్లం వెంకటేశ్వరరావుకు చెందిన రామచంద్ర కారు షెడ్డులో పెట్టారు. కారులో ఉన్న గంజాయిని మరో కారులో తరలించేందుకు మంగళవారం కారుతో అక్కడికి చేరుకున్నారు. అప్పటికే ముందస్తు సమాచారం మేరకు అప్రమత్తమైన పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు సిబ్బంది రాబడిన సమాచారం మేరకు కారును అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా సుమారు 94 కేజీల గంజాయి గుర్తించారు. నిందితులు కేరళ రాష్ట్రానికి చెందిన శైజు మచ్చింగల్ వర్గీస్, మండకర సడకతుల్లాలను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుండి గంజాయి తో పాటు ఆడి కారు, స్విఫ్ట్ డిజైర్ కారు, 4 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుందని డీఎస్పీ వివరించారు. నిందితులు ఇద్దరూ కూడా గతంలో వేర్వేరు గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ఈ కేసును ఛేదించిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ప్రత్యేకంగా అభినందించినట్లు చెప్పారు. పెదకాకాని తహసీల్దార్ పి.రత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో సీఐ బండారు సురేష్‌బాబు, ఎస్‌ఐ వి.రాంబాబు ఉన్నారు.

మందుబాబుల అడ్డాగా బస్టాండ్ ప్రాంగణం

పట్టించుకోని అధికారులు



ఆర్టీసీ ప్రాంగణంలో మద్యం తాగుతున్న దృశ్యం

నరసరావుపేట టౌన్: ఒక వైపు వందల సంఖ్యలో ప్రయాణికులు తిరుగుతుంటే.. మరో వైపు మద్యం మత్తులో కొందరు తూలుతుంటారు. ఒక వైపు పక్కనే నమాజ్ ప్రార్థనలు వినిపిస్తుంటే.. మరో వైపు మత్తెక్కిన మందు బాబులు కేకలేస్తుంటారు. ఒక వైపు ప్రయాణికులు వారి నుంచి భయభ్రాంతులకు గురవుతుంటే.. మరో వైపు మందు బాబులు చిల్లర వేషాలతో వెకిలిగా నవ్వుతుంటారు. పల్నాడు జిల్లా ప్రధాన కేంద్రమైన నరసరావుపేట ఆర్టీసీ ప్రాంగణంలో పరిస్థితి ఇది. కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ పక్కనే ఉన్న ప్రాంగణంలో తాత్కాలిక బస్టాండ్‌ను ఏర్పాటు చేసి అక్కడ నుంచి ప్రయాణికులను తరలిస్తుంటారు. అయితే ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఆ స్థలం మందుబాబులకు అడ్డాగా మారింది. సాయంత్రం అయితే మందుబాబు లు అక్కడకు గుంపులుగుంపులుగా చేరి బహిరంగంగా మద్యం తాగుతున్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ప్రభుత్వ మద్యం షాపు ఉండడంతో మందు బాబులకు ఈ ప్రాంతం రిలాక్స్ ప్రాంతంగా మారింది.

పులుల సంచారంపై పుకార్లు!

- పులులు చూశామంటున్న మహిళలు
- అవి పులులు కాదంటున్న అటవీశాఖాధికారులు

మాచర్ల: పట్టణ శివారు ప్రాంతంలోని 9వ వార్డు లోని ఎరుకల కాలనీ చివరి ప్రాంతంలో రెండు పులులు సంచరిస్తున్నట్లు ఆ ప్రాంత వాసులు ఆందోళనకు గురవుతున్నారు. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో శివారు ప్రాంతంలో నివాస ముంటున్న మహిళ డి.రాజేశ్వరి బయట కూర్చున్న సమయంలో రెండు జంతువులు వేగంగా దూకుతూ సంచరించటంతో భయపడిన ఆ మహిళ వెంటనే ఇంటిలోకి వెళ్లి తలుపులు వేసుకొని బంధువులకు సమాచారం ఇచ్చారు. ఆ తరువాత 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అటవీ శాఖ అధికారులు జంతువుల అడగు జాడలను పరిశీలించారు. ఇవి అడవి కుక్కలని, భయపడాల్సిన అవసరం లేదని తేల్చారు. దీంతో శివారులో నివాసముంటున్న ఇద్దరు మహిళలు బుధవారం ఇళ్లు ఖాళీ చేశారు. కౌన్సిలర్ జగన్నాథం శివయ్య మాట్లాడుతూ వెల్దుర్తి మండలంలోని మండాది అడవుల నుంచి శివారులోని అటవీ ప్రాంతంలో పులు లు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. అటవీ శాఖ అధికారులు దృష్టి సారించాలని విన్నవించారు.

అట్రాసిటీ కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇవ్వటం నిలిపివేయాలి

నరసరావుపేట: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలో నిందితులకు స్టేషన్ బెయిల్ ఇవ్వటాన్ని వెంటనే నిలిపివేయాలని దళిత ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా దళితుల మీద దాడులు పెరుగుతున్న నేపథ్యంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్), వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర దళిత రక్షణ యాత్రలో ప్రభుత్వం ముందు ఉంచాల్సిన డిమాండ్లపై బుధవారం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో దళిత ప్రజాసంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా అధ్యక్షులు చింతపల్లి నాగమల్లేశ్వరరావు, కారుచోల రోశయ్య, ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ప్రసాద్, జై భీమ్ భారత్ పార్టీ జిల్లా సమన్వయకర్త గోదా జాన్‌పాల్, డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిగం చిట్టిబాబు, మాల మహానాడు జిల్లా నాయకులు కూచిపూడి చంద్రశేఖర్, ఎంఐఎం నాయకులు కరిముల్లా, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి తాళ్లూరు పెద్దిరాజు, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు జి రవిబాబు, అనుముల లక్ష్మీశ్వర రెడ్డి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

తండ్రీకొడుకులకు గాయాలు



తీవ్రంగా గాయపడిన షేక్ మౌలాలి



గాయాలపాలైన షేక్ మస్తాన్‌వలి

నాదెండ్ల: జాతీయ రహదారి మలుపు వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో తండ్రీకొడుకులు గాయాలపాలైన ఘటన బుధవారం గణపవరం వద్ద చోటు చేసుకుంది. నేషనల్ హైవే పెట్రోలింగ్ పోలీసులు తెలిపిన వివరాలు.. గణపవరానికి చెందిన షేక్ మస్తాన్‌వలి, చిలకలూరిపేటలోని మద్దినగర్‌లో నివాసం ఉంటూ మెకానిక్‌గా పనిచేస్తుంటాడు. వృద్ధాప్య పెన్షన్ కోసం తన తండ్రి షేక్ మౌలాలిని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని గణపవరం వెళ్లి తిరిగి చిలకలూరిపేట వస్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారిని దాటి వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న తండ్రీకొడుకులు గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను చిలకలూరిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మస్తాన్‌వలి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.